సాక్షి
వికారాబాద్

మంగళవారం : 19 : మార్చి : 2024



నిబంధనలు బేఖాతరు

నవాబుపేట మండలంలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అయినా పట్టించుకునే వారు లేరు. 8లో▸



అసైన్డ్ భూమిలో రోడ్డు

భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ వ్యాపారులు అసైన్డ్ భూములను సైతం వదలడం లేదు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
మంగళవారం (సాయంత్రం) 6:32	బుధవారం (ఉదయం) 4:59

న్యూస్‌రీల్

సూచనలు పాటిస్తే మెరుగైన ఫలితాలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్

అనంతగిరి: శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు వేదికల కేంద్రంగా శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటల సాగు, చీడపీడల నివారణ, నూతన వంగడాలు, ఆధునిక పద్ధతులు వంటి వాటిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కొడంగల్, తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లోని బొంరాస్‌పేట, యాలాల, మోమిన్‌పేట, పూడూరు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచనలు,సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

దైవ చింతనతో ప్రశాంతత

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



మర్పల్లి: దైవ చింతనతో మానసిక ప్రశాంతత పొందవచ్చని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొంషెట్‌పల్లిలో నిర్వహిస్తున్న బీరప్ప జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం గంట పాటు దేవుడి సేవలో ఉండాలన్నారు. పార్టీలకతీతంగా జాతర నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు స్పీకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాములు, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, యాదవ సంఘం మర్పల్లి గ్రామ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, ఉత్సవ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మాజీ సర్పంచ్ రఫీయొద్దీన్, పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ సురేష్, ఎంపీటీసీ దశరథ్, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల విక్రయానికి వేలం

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో టెంకాయల విక్రయానికి సోమవారం వేలం నిర్వహించారు. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మల్లేశ్ 5,71,100 రూపాయలకు వేలం దక్కించుకున్నట్లు ఆలయ చైర్మన్ నర్సమ్మ, ఈఓ సుదాకర్ తెలిపారు.బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేలం పర్యవేక్షకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాండుశర్మ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జ్యోతిపద్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రియదర్శిని

కుల్కచర్ల: అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జ్యోతిపద్మ, సీడీపీఓ ప్రియదర్శిని సూచించారు. సోమవారం కుల్కచర్ల అంగన్‌వాడీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు పోషకాహారం,ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎప్పటికప్పుడు సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, సూపర్‌వైజర్లు యాదమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: వికారాబాద్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మొదటి రోజు పరీక్ష ప్రశాంతం

జిల్లా వ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. గంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సందడి నెలకొంది. పూర్తిగా తనిఖీలు నిర్వహించిన తరువాతే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.



పెద్దేముల్: మంబాపూర్ పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థినులు

సువిధతో అనుమతులు

- ప్రచార సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం నుంచే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించాలనుకునే రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందు దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు వస్తాయని తెలిపారు. రాత్రి 10నుంచి ఉదయం 6గంటల వరకు లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని ఆదేశించారు. మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ.. విద్వేషాలు చెలరేగేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల వద్ద, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయరాదని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ సర్వే లెన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వే లెన్సు బృందాలను, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై 1950 టోల్ ఫ్రీ నంబరు లేదా సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు చెందిన వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను 48 గంటల్లో తొలగించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల సామగ్రిని ఎవరు ప్రింట్ చేయమన్నారనే సమాచారం తమ వద్ద ఉంచుకోవాలని ఆదేశించారు. అధికారులు అడిగిన వెంటనే ఇవ్వాలని సూచించారు. ఎంసీఎంసీ ద్వారా అనుమతి పొందిన తరువాతే పోస్టర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కోడ్‌ను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జెడ్పీ సీఈఓ సుధీర్, ఆర్డీఓ వాసు చంద్ర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు

విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సోమవారం వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలను పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని సిబ్బందికి సూచించారు. మొదటి రోజు పరీక్షకు 240మంది విద్యార్థులకు గాను 239 హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రంలోకి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ సునీత, అబ్జర్వర్ వినయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: కస్తూరుపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

జిల్లాలో పటిష్ట నిఘా

- ఎస్పీ కోటిరెడ్డి
- కొత్తగా ఏడు చెక్‌పోస్టులు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. చంద్రకల్, కస్తూర్‌పల్లి, మైల్వార్, ఇందర్‌చెడ్, నవాంగి, కొత్లాపూర్, బొపునారం ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు తరలించే వారు కచ్చితంగా రసీదు చూపాలన్నారు. లేకుంటే డబ్బును సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. పరికరాలు, బంగారం, వెండి మొదలగు వస్తువులు తరలించే సమయంలో రసీదులు వెంట తెచ్చుకోవాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

తనిఖీలు షురూ..

కొడంగల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కస్తూరుపల్లి వద్ద (తెలంగాణ – కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో) సోమవారం పోలీసు చెక్‌పోస్టును ప్రారంభించారు. సీఐ శ్రీధర్‌రెడ్డి చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సివిల్ పోలీసులతో పాటు సాయుధ బలగాలతో పహారా కాస్తున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు

దౌల్తాబాద్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసు యంత్రాంగం తనిఖీలను ముమ్మరం చేసింది. సోమవారం మండల పరిధిలోని కర్ణాటక సరిహద్దు అయిన చంద్రకల్ గ్రామం, కస్తూరుపల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల దృష్ట్యా డబ్బులు, మద్యం అక్రమంగా రవాణా చేయకుండా.. నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనల మేరకు ఒక వ్యక్తి రూ.50వేలకు మించి నగదును వెంట తీసుకెళ్లరాదని సూచించారు. రసీదు లేకుండా తరలిస్తే నగదును సీజ్ చేసి, ఎన్నికల వ్యయ పరిశీలకులకు అప్పగిస్తామన్నారు.

కోత్లాపూర్ వద్ద చెక్‌పోస్ట్

తాండూరు రూరల్: తెలంగాణ–కర్ణాటక సరిహద్దు కోత్లాపూర్ శివారులో సోమవారం పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామని రూరల్ సీఐ అశోక్ తెలిపారు. కార్యక్రమంలో కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, పోలీసులు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌పై ఆసక్తి

- మూడేళ్లపాటు అంతర పంటలకు అనుకూలం
- నాలుగో ఏడాది నుంచి కాపు
- జిల్లాలో 5,500 ఎకరాల్లో సాగు లక్ష్యం
- ఇప్పటికే మొక్కలు నాటిన 86 మంది రైతులు



గోపులారంలో ఆయిల్‌పామ్ పంటను సాగు చేసిన రైతులు

షాబాద్: సంప్రదాయ పంటలతో కుస్తీ పడుతున్న రైతులు సేద్యంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. అధిక లాభాలు గడించేందుకు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. తొలిసారిగా ఆయిల్‌పామ్ సాగు చేసిన నేపథ్యంలో పంట సాగుకు విధానం అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు జిల్లా ఉద్యానశాఖ అవగాహన కల్పిస్తోంది. జిల్లా రైతులకు ఆర్థికంగా అండగా ఉండేలా వాణిజ్య పంటను ఉద్యానశాఖ పరిచయం చేసింది. ఏడాది క్రితం నాటిన మొక్కలు ఎదుగుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోవాల్సి వస్తోంది. దీంతో రైతులకు ఉపాధిబాటను చూపేందుకు జిల్లా అధికారులు 2023లో ఆయిల్ పామ్ సాగుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆసక్తి గల రైతులకు ఆ పంటసాగుపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ

జిల్లాలో 5,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం అంజేస్తున్న సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తం ఇవ్వాలని నిర్ణయించింది. ఆయిల్ పామ్ సాగుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తున్నాయి. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తర్వాత నాలుగో ఏడాది నుంచి కాపు మొదలై 30 ఏళ్ల పాటు నిరంతరం ఆదాయాన్ని పొందొచ్చు. మొదటి మూడేళ్ల మొక్కల మధ్యలో అంతర పంటలను సాగు చేసుకోవచ్చు.

అనువైన నేలలు

ఆయిల్‌పామ్ సాగుకు ఇక్కడ నేలలు అనుకూలం. దేశంలో వంట నూనె వినియోగం ఎక్కువ. ఇందుకు విదేశాల నుంచి పామాయిల్ గింజలను దిగుమతి చేసుకుంటున్నాం. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పంట ఎక్కువగా మలేషియా, ఇండోనేషియా దేశాలు ఆర్థికాభివృద్ధి సాధించాయి. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది.

వంద శాతం రాయితీపై డ్రిప్

ఆయిల్ పామ్ సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యం పరికరాలను వంద శాతం సబ్సిడీపై ఇస్తున్నారు. బీసీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీపై సాగు నీటి పారుదల పరికరాలు ఇస్తారు. ఐదు హెక్టార్ల వరకు, దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలా ఆయిల్ పామ్ రైతులకు 125 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలకు రాయితీ ఇస్తారు.

ప్రయోజనాలు

- ◆ఎకరా వరిసాగుకు వినియోగించే నీటితో మూడెకరాల ఆయిల్ సాగు చేయవచ్చు
- ◆మూడేళ్లపాటు అరటి, మిరప, సోయాబీన్, పసుపు, కూరగాయలు, పూలు, నువ్వులు, వేరుశనగ, పొద్దు తిరుగుడును అంతర పంటలుగా సాగు చేయవచ్చు.
- ◆ఒక టన్ను గింజల ధర రూ.19వేలు ఉంది.
- ◆ఎకరాకు 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుంది.
- ◆ప్రకృతి వైపరీత్యాల బెడద ఉండదు.
- ◆రైతులకు ప్రతీ ఏడాది నికర ఆదాయం, 30 ఏళ్ల వరకు పంట దిగుబడి ఉంటుంది.
- ◆వరి పంటతో పోల్చితే శ్రమ తక్కువ

బీమా.. కల్పించండి ధీమా

భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు

- సభ్యత్వం తీసుకున్న వారికి ఆర్థిక చేయూత
- అవగాహన కల్పించడంలో అధికారుల అలసత్వం
- అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు తీరని నష్టం



భవన నిర్మాణ పనుల్లో కార్మికులు

కొత్తూరు: భారీ నిర్మాణాల్లో పనులు చేసే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2019లో అప్పటి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసింది. బోర్డులో సభ్యత్వం తీసుకున్న కార్మికులకు బీమా సౌకర్యాన్ని అమలు చేసింది. సభ్యత్వం పొంది బీమా తీసుకున్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందినా, అంగవైకల్యానికి గురైనా ఆర్థికంగా ఆదుకుంటుంది. సభ్యత్వం పొందిన కార్మికుల ఇంట్లో శుభకార్యాలకు సైతం ఈ పథకం ద్వారా ఆర్థికసాయం అందుతుంది. సంబంధిత శాఖలకు చెందిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలామంది స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు బీమా, సభ్యత్వానికి దూరంగా ఉన్నారు. క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించాల్సిన అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలకు గురైనప్పటికీ కార్మికులు ప్రభుత్వ సాయానికి నోచుకోవడం లేదు.

అవగాహన లేక దూరం

ప్రస్తుతం జిల్లా పరిధి చాలా వరకు హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉంది. దీంతో భారీ కట్టడాలు, పెద్ద భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ స్థానికులతో పాటు ఒడిశా, బీహార్, ఉత్తరప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన వేలమంది కార్మికులు పని చేస్తున్నారు. వారిలో సగం మందికి మాత్రమే బోర్డు సభ్యత్వం, గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం ఉన్నాయి. భవన నిర్మాణ బోర్డు పరిధిలోకి వచ్చే కార్మికులకు బీమా, ఇతర సౌకర్యాలపై అవగాహన కల్పించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో అనుకోని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు కార్మికులు అన్ని విధాలా నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం.. మరికొన్ని చోట్ల కాంట్రాక్టర్లు వారిని మభ్యపెడుతుండడంతో పథకానికి దూరంగా ఉంటున్నారు.

సభ్యత్వం ఇలా పొందాలి..

స్థానిక, స్థానికేతరులైన తాపీమేస్త్రీలు, కూలీలు, నిర్మాణరంగంలో పనిచేసే వారు భవన నిర్మాణ కార్మికుల పరిధిలోకి వస్తారు. తాము పనిచేసే నిర్మాణరంగ సంస్థ ఇచ్చిన గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డుతో కార్మికశాఖలో భవన నిర్మాణ కార్మికుడిగా నమోదు చేసుకోవాలి. అన్ని వివరాలు సక్రమంగా ఉంటే వారికి కార్మిక శాఖ గుర్తింపుకార్డు జారీ చేస్తుంది.

బీమాతో ప్రయోజనాలు

- ❖ కార్మికశాఖ జారీ చేసిన గుర్తింపుకార్డు, బీమా పరిమితి గడువు ఐదేళ్ల వరకు ఉంటుంది.
- ❖ ప్రతి ఐదేళ్లకోసారి బోర్డు నిర్దేశించిన కొద్దిపాటి డబ్బులు చెల్లించి గుర్తింపుకార్డు, బీమా రెన్యూవల్ చేయించుకోవాలి.
- ❖ బీమా పొందిన కార్మికుడు సహజ మరణం పొందితే బాధిత కుటుంబానికి రూ.1.30 లక్షలు, నిర్మాణ సమయంలో మృతి చెందితే వారి కుటుంబానికి రూ.5 లక్షల నుంచి రూ.6లక్షల వరకు పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుంది.
- ❖ ప్రమాదాల్లో శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం పొందొచ్చు.
- ❖ స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో చేరితే మూడు నెలల వరకు నెలకు రూ.4,500 వరకు సాయం అందుతుంది.
- ❖ బోర్డులో సభ్యత్వం పొందిన కార్మికుల ఇళ్లలో జరిగే పెళ్లిళ్లకు రూ.30 వేలు అందుకునే వీలుంది.
- ❖ మహిళా కార్మికులకు ప్రసవాల కోసం రూ.30 వేల ఆర్థికసాయం ఉంటుంది.

క్లుప్తంగా

సీఎంను కలిసిన కోట్‌పల్లి వాసి



సీఎం రేవంత్‌రెడ్డితో శివకుమార్ కుటుంబ సభ్యులు

బంట్వారం: వీరశైవ లింగాయత్ లింగ బలిజ యువదళ్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు ఎల్. శివకుమార్ కుటుంబ సమేతంగా సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం కలిశారు. మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి పాత పరిచయం కావడంతో ఆప్యాయతగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీ రంజిత్‌రెడ్డి



ఎమ్మెల్యేతో ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తు న్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరారని ఎంపీ తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేందుకు కలిసిగట్టుగా పనిచేస్తామని ఇరువురూ వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వినతి



స్పీకర్‌ను కలిసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

అనంతగిరి: వికారాబాద్ జిల్లా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సోమవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు శాలువాతో సత్కరించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగు లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్పీకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కర్ణాటక డీజిల్ పట్టివేత



పట్టుబడ్డ డీజిల్ ట్రాక్టర్

పెద్దేముల్: కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా డీజిల్ తీసుకెళుతున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టివేశారు. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మన్‌సాన్‌పల్లికి చెందిన రవిందర్ ఆదివారం రాత్రి కర్ణాటకలోని పెట్రోల్ బంక్ నుంచి 15 డ్రమ్‌లల్లో సుమారు రెండు వేల లీటర్ల డీజిల్‌ను ఓ ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. అర్ధరాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులకు పట్టుబడ్డారు. అక్రమంగా తీసుకువస్తున్న డీజిల్‌తో పాటు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని సోమవారం ఎస్‌ఐ రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదు చేశారు.

నిబంధనలు బేఖాతరు

- జోరందుకున్న చెట్ల నరికివేత
- ఎడారులుగా మారుతున్న పంట పొలాలు
- పట్టించుకోని ఫారెస్టు, రెవెన్యూ అధికారులు



నారెగూడలో అనుమతులు లేకుండా లారీలో నింపుతున్న కలప (ఫైల్)

నవాబుపేట: కలప వ్యాపారులు, అధికారులు కుమ్మక్కైతే ఇంకేముంది అందినకాడికి దండుకోవడమే. దీనికి నిదర్శనమే మండలంలో జోరందుకుంటున్న అక్రమ కలప రవాణా. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని తీసుకొచ్చి వేల సంఖ్యలో చెట్లను పెంచాలనుకుంది. కానీ ఆ లక్ష్యానికి అధికారుల నిర్లక్ష్యంతో తూట్లు పడుతున్నాయి. మండల పరిధిలోని పులుమామిడి, అక్నాపూర్, చిట్టిగిద్ద, కేషవపల్లి, గంగ్యాడ, లింగంపల్లి, నవాబుపేట, దాతాపూర్, నారెగూడ తదితర గ్రామాల్లో కలప వ్యాపారులు చెట్లను కొనుగోలు చేసి విచ్చలవిడిగా నరికి రాత్రిళ్లు రవాణా చేస్తున్నారు. సంబంధిత అధికారులు సైతం గ్రామాలకు వెళ్లకుండానే చెట్లు నరికేందుకు లంచాలు తీసుకుంటూ వ్యాపారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తుమ్మ వేత, చింత తదితర చెట్లను రైతుల వద్ద తక్కువ ధరలకు కొని వ్యాపారులు ఎక్కువకు అమ్ముకుంటున్నారు. ప్రకృతి సంపదను నాశనం చేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

సీజన్ వచ్చిందంటే అంతే

ఏటా వేసవి వచ్చిందంటే చాలు ఇబ్రహీంపట్నానికి చెందిన కలప వ్యాపారులు ప్రకృతి సంపదను నాశనం చేస్తారు. జనవరి మొదలుకొని జూన్ వరకు పంటలు అయిపోవడంతో అనుకూలంగా భావించి వ్యాపారులు ప్రకృతి సంపదను కొల్లగొట్టి జేబులు నింపుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో వందల, వేల సంఖ్యలో చెట్లు నరికి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారు.

వాల్టాకు తూట్లు

ప్రకృతి సహజ వనరుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన వాల్టా చట్టానికి వ్యాపారులు తూట్లు పొడుస్తున్నా, దానిని పరిరక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై మండలంలో సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది పోలీసు సిబ్బంది చెట్ల నరికి వేతను గమనించి వారి వద్దకు వెళ్లి మామూళ్లు తీసుకొని వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కలప, ఇసుక రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఫారెస్టు, రెవెన్యూ అనుమతులు లేకుండా కలపను నరకడానికి వీలు లేదు. అక్కడక్కడ చెట్లను నరుకుతున్నట్లు సమాచారం వచ్చింది. ఇప్పటికే పలువురుపై కేసులు నమోదు చేశాం. ఇక నుంచి కఠిన చర్యలు తీసుకొని అక్రమ కలప రవాణాను అరికడుతాం.

– కార్తిక్‌రెడ్డి, ఫారెస్టు అధికారి, వికారాబాద్

పట్టించుకునే వారే లేరు



గ్రామాల్లో విచ్చల విడిగా చెట్లను నరికి తీసుకపోతుంటే పట్టించుకునే వారే లేకుండా పోయారు. రెవెన్యూ, ఫారెస్టు అధికారులు ఎక్కడ ఉంటారో తెలియదు. వ్యాపారులు ఇచ్చే మామూళ్లకు తలొగ్గి వారి జోలికి పోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్, గొల్లగూడ

వర్షాలు కురవటం లేదు



ప్రభుత్వం అనుమతులు లేకుండానే వ్యాపారులు రైతుల వద్ద చెట్లను కొనుగోలు చేసి అటవి సంపదను కొల్లగొడుతున్నారు. రోజురోజుకి వృక్షాలు తరిగిపోవడంతో ఇప్పటికే వర్షాలు సరిగ్గా పడటం లేదు. అక్రమ చెట్ల నరికివేతను అరకట్టి అటవి సంపదను కాపాడాలి.

– పర్మయ్య, మాజీ సర్పంచ్, నారెగూడ

అధికారుల నిర్లక్ష్యమే



వ్యాపారులు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఫారెస్టు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. వారి నిర్లక్ష్యంతోనే సమృద్ధిగా ఉన్న వన సంపద మాయమవుతున్నాయి.

– రంగారెడ్డి, పులుమామిడి

అసైన్డ్ భూమిలో వెలిసిన రోడ్డు



ప్రభుత్వ భూమి నుంచి వేసిన రోడ్డు

పెద్దేముల్: భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ వ్యాపారులు అసైన్డ్ భూములను సైతం వదలడం లేదు. మండలంలోని జనగాం గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 178లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి(అసైన్డ్)ని 30 ఏళ్లుగా గ్రామానికి చెందిన బుల్ల భీమమ్మ సాగు చేస్తున్నారు. దీనికి ఆమె పేరుపై లావుని పట్టా సైతం ఉంది. ఈ భూమి తాండూరు–హైదరాబాద్ ప్రధాన రహదారికి పక్కన ఉండడంతో రియల్ వ్యాపారుల కన్ను పడింది. వారం రోజుల క్రితం సదరు అసైన్డ్ భూమి నుంచి లోపల ఉన్న పట్టా భూములకు వెళ్లేందుకు అక్రమ రోడ్డును ఏర్పాటు చేశారు. దీనిపై ఆర్‌ఐ రాజిరెడ్డి పరిశీలించి అసైన్డ్ భూమి నుంచి రోడ్డు వేసినట్లు గుర్తించి తహసీల్దార్ కిషన్‌కు నివేదికను ఇచ్చారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రోడ్డును పరిశీలించి అక్రమమని తేల్చారు. అసైన్డ్ భూమి నుంచి వేసిన రోడ్డును తొలగించాలని ఆయన హెచ్చరించారు.

ఆస్పత్రికి వచ్చి అనంత లోకాలకు

గుండెపోటుతో వృద్ధుడి మృతి



లక్ష్మయ్య, మృతదేహం

నవాబుపేట: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన ఓ వ్యక్తి.. ఆస్పత్రి ఎదుటే గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడ గ్రామానికి చెందిన దండు లక్ష్మయ్య(65) రైతు. కొంత కాలంగా ఆయన ఆస్తమాతో బాధపడుతున్నారు. ఈ విషయమై ఏడాది నుంచి మండల కేంద్రంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుని వద్ద చికిత్స తీసుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఆస్పత్రికి లక్ష్మయ్య వెళ్లారు. ఆస్పత్రిలో ఎక్కువ మంది ఉండటంతో బీపీ చూయించుకొని బయట కూర్చున్నారు. అదే సమయంలో ఆయన అకస్మాత్తుగా కింద పడిపోయారు. గమనించిన తోటి రోగులు విషయాన్ని ఆర్‌ఎంపీ వైద్యునికి తెలిపారు. ఆయన వచ్చి చూసి గుండె పోటు వచ్చిందని భావించి సీపీఆర్ చేశారు. కానీ లక్ష్మయ్య అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. గుండెపోటు వచ్చి ఆయాస పడుతున్న వృద్ధున్ని పట్టించుకునే వారు లేక అక్కడే మృతి చెందినట్లు స్థానికులు ఆరోపించారు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

వివిధ అంశాలపై ఎంపీటీసీల ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ రాములు

దోమ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అనసూయ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనగా సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ముందుగా వ్యవసాయ శాఖపై సమీక్ష చేయగా.. యాసంగికి సంబంధించి పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సంబంధిత అధికారులు ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. దీనిపై ఎంపీటీసీ రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తి అవుతున్నప్పటికీ చాలా మంది రైతులకు రైతుబంధు అందలేదన్నారు. గొర్రెల కోసం డీడీలు కట్టినా నేటికి పంపిణీ చేయలేదని విమర్శించారు. ఉపాధిహామి కూలీలకు గతేడాది నుంచి డబ్బులు చెల్లించలేదని మండిపడ్డారు. గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండా సీసీ రోడ్లు ఎలా వేశారని ఆయన ప్రశ్నించారు. గ్రామాలలో కరెంటు కష్టాలు మొదలయ్యాయని ఆయా గ్రామాల ఎంపీటీసీ వాపోయారు. అధికారులు కరెంటు కష్టాలు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి అధికారి గ్రామాలలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమలం గూటికి యాలాల ఎంపీపీ

రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో చేరిక



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన బాలేశ్వర్‌గుప్తా తదితరులు

యాలాల: బీఆర్‌ఎస్ పార్టీ యాలాల ఎంపీపీ తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా సోమవారం బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిల సమక్షంలో పార్టీ కండువా కప్పుకొన్నారు. ఆయనతో పాటు యాలాల మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు సుధాకర్, బాయిమీది అశోక్ తదితరులు పార్టీలో చేరారు. ఎంపీపీ ఎన్నికల కంటే ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన బాలేశ్వర్‌గుప్తా, అనంతరం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. దాదాపు ఐదేళ్ల తరువాత సొంత పార్టీలోకి తిరిగి రావడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి యాలాల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగం యాదగిరి, వెంకటేశం తదితరులు ఉన్నారు.

ఔటర్‌పై కారు బోల్తా

శంషాబాద్: ఔటర్‌పై కారు బోల్తా పడి ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. చిన్నగోల్కొండ సమీపంలో ఔట ర్ వద్ద కూకట్‌పల్లి నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాల్యాయయి. చికిత్స నిమిత్తం వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కారును అక్కడి నుంచి తొలగించారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల గడ్డంపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉప్పర్‌పల్లి సామ భూపాల్ రెడ్డి గార్డెన్‌లో ఆదివారం అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅ తిథిగా చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని బీజేపీ బలంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చి హామీలన్నీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదన్నారు. బీజేపీ ప్రతి కార్యకర్తకు సమూచిత స్థానం కలుగుతుందన్నారు. అదే విధంగా చేవెళ్ల పార్లమెంటు బీజేపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని..ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నప్పటికీ.. రాష్ట్రంలో వాటిని అమ లు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్ రాజ్, వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, బొక్క వేణుగోపాల్, అంజన్ కుమార్, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, నంద కిశోర్, బాబురావు పాల్గొన్నారు.

తలపై మోది వ్యక్తి దారుణహత్య

పూడూరు: చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మన్నేగూడకు చెందిన హరిజన్ సంజీవ్‌కుమార్(38) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తాడు. శనివారం రాత్రి ఎన్కేపల్లి శివారులో ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు బలమైన ఆయుధంతో తలపై దాడి చేసి హత్య చేశారు. ఈ మేరకు సోమవారం క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో ఎవరితోనైనా విభేదాలు ఉన్నాయనే కోణంలో పోలీసులు మృతుడి కుటుంబీకులను విచారించారు. తమకు గ్రామంలో ఎలాంటి పగలు లేవని తెలిపారు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమన్నారు. అన్ని కోణాల్లో కేసును పరిశీలిస్తున్నామని నిందితులను త్వరలో పట్టుకుంటామని వివరించారు. పరిగి సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

తాండూరు రూరల్: మండల పరిధిలోని సిరిగిరిపేట్‌లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన వడ్డె పరుశురాం(24)కు సంబంధించిన కేసులో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కరన్‌కోట్ పోలీసులు కేసు నమోదు చేయగా విచారణ అనంతరం మృతికి కారణమైన పరుశురాం అన్న పాండు, వదిన నాగమ్మను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. అనంతరం కోర్టులో హాజరు పరచగా పాండును పరిగి జైలుకు, నాగమ్మను చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

కాశీకి వెళ్తూ.. కానరాని లోకాలకు



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొని

- ఇద్దరి దుర్మరణం
- నలుగురికి తీవ్రగాయాలు

షాద్‌నగర్‌రూరల్: కాశీ ప్రయాణికులను రోడ్డు ప్రమాదం వెంటాడింది. కాళభైరవుడి దర్శనం కాకుండానే కానరాని లోకాలకు చేరుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని బెంగుళూరు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం, మైసూరులోకి రామకృష్ణా నగర్‌కు చెందిన మిత్రులు బీఎల్ నర్సింహన్ అయ్యర్(47), ఎస్‌కే రత్నాకర(66), విశ్వనాథన్, మదన్‌కుమార్, రఘురాం, శ్రీరాం మారుతీ ఈకో వాహనంలో కాశీ యాత్రకు బయలుదేరారు. మార్గ మధ్యంలో షాద్‌నగర్ సమీపంలో వారు కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహన్ అయ్యర్, రత్నాకర ఘటనా స్థలిలో మృతిచెందారు. మరో నలుగురు గాయపడగా మదన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. విషయాన్ని తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఆర్కాన్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని విరమించుకోవాలి

తాండూరు టౌన్: పాత తాండూరు రైల్వే గేటుపై నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని విరమించుకోవాలని స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. రూ.74 కోట్లతో పాత తాండూరు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో ఉపయోగమేమీ లేదన్నారు. దీనికి బదులుగా ఇప్పటికే ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని విస్తృతం చేయాలన్నారు. పాత తాండూరులోని పలు ప్రాంతాల ప్రజలకు ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పాత తాండూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి మార్గమేమీలేదని, అలాంటప్పుడు ఓవర్ బ్రిడ్జి, 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టడం వ్యర్థమన్నారు. బ్రిడ్జిపై నుంచి రాకపోకలు కొనసాగించాలంటే మాణిక్‌నగర్, మున్సిపల్ క్వార్టర్స్, రెండు వసతి గృహాలు, మూడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు సుమారు మూడు కిలోమీటర్ల మేర ఎక్కువగా నడవాల్సి వస్తుందన్నారు. అలాగే ఈ నిర్మాణం వల్ల సుమారు 200 ఇళ్లు కూల్చేయాల్సి వస్తుందన్నారు. అందువల్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని విరమించుకుని, రైల్వే అండర్ బ్రిడ్జి ద్వారా రాకపోకలు జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా ఫరీద్

ఆమనగల్: ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఫరీద్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఎన్‌ఎస్‌యూఐ జిల్లాఅధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి నియామక పత్రం అందజేసినట్లు ఫరీద్ తెలిపారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ.. కార్యదర్శిగా నియమించినందుకు విష్ణువర్ధన్‌రెడ్డికి, చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రత్యేక'ంగా వచ్చారు.. వెళ్తున్నారు!

- గ్రామాల్లో నెలకొన్న సమస్యలు
- అత్యవసర పనులకు తప్ప కానరాని పాలన

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న జాతిపిత మాటలకు ప్రత్యేక పాలనలో అంతరాయం కలుగుతోంది. పని ఒత్తిడి కారణంగా ఆయా శాఖలను సమన్వయం చేయడంలో ప్రత్యేక అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాల బాధ్యత పూర్తిగా పంచాయతీ కార్యదర్శులపై పడింది.



గ్రామ పంచాయతీ కార్యాలయం

పరిగి: గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. ఫిబ్రవరి 1 నాటికి సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం గెజిటెడ్ స్థాయి అధికారులకు గ్రామాల పాలన బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రత్యేక అధికారులుగా నియామకమైన గెజిటెడ్ స్థాయి అధికారులు తమ మాతృశాఖతో పాటు అదనంగా అప్పగించిన రెండు, మూడు గ్రామాల పాలనా వ్యవహారాలు చూసుకోవాలి. అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో అమలు చేయడం, ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించడం వంటి బాధ్యతలు ప్రత్యేక అధికారులకు అప్పగించారు.

సవాల్‌గా మారిన పాలన

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సవాల్‌గా మారింది. సర్పంచ్‌లకు ఉండే బాధ్యతలు ప్రత్యేక అధికారులకు ఉన్నాయి. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీఓ మండల ప్రత్యేక అధికారులు కలిసి ప్రతి 15 రోజులు లేదా నెల రోజులకు ఒకసారి గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఇంతవరకు ఎక్కడా నిర్వహించిన దాఖలాలు లేవు. ఇంటి పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య పనులపై దృష్టి సారిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి. ప్రత్యేక అధికారులు వారి శాఖల బాధ్యతలలో నిమగ్నమై పంచాయతీలను నిర్లక్ష్యం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయి ప్రజాప్రతినిధులకు బాధ్యతలు అప్పగించేంత వరకు ప్రజలకు ఆ కష్టాలు తప్పేలా లేవు.

ఎక్కడి సమస్యలు అక్కడే

గ్రామాల్లో రోజు రోజుకు సమస్యలు పెరిగిపోతున్నాయి. గతంలో గ్రామంలో ఏ సమస్యలు ఉన్నా సర్పంచ్ దృష్టికి తీసుకెళ్తే వాటిని పరిష్కరించే ప్రయత్నం చేసేవారు. కానీ ప్రత్యేక అధికారులు ఎవరో ప్రజలకు తెలియక సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండ కాలం గ్రామాల్లో నీటి సమస్యలు తెలుత్తుతున్నాయి. ఈ సమయంలో కచ్చితంగా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి తాగు నీటి సమస్యలను పరిష్కరించాలి. గతంలో పనులు చేసేందుకు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌కి జాయింట్ చెక్ పవర్ ఉండేది. ప్రత్యేక పాలనల్లో ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటి వరకు జాయింట్ చెక్ పవర్ రాలేదు. బ్యాంకు, ట్రెజరీ చెక్ పవర్‌కు సంబంధించి పనులు పెండింగ్‌లో ఉండటంతో పూర్తిస్థాయిలో అందలేదు. క్యాష్ బుక్, చెక్ బుక్, ఎంబీ రికార్డులు పంచాయతీ కార్యదర్శుల ఆధీనంలో ఉన్నాయి. జాయింట్ చెక్‌పవర్ రాక గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కావడం లేదు.

ప్రజల నుంచి వినతులు



సమయానికి తాగునీరు రాకున్నా, మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా లేకున్న ప్రజలు మా దృష్టికే తీసుకు వస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పన్నుల వసూళ్లపై దృష్టి పెడుతున్నారు.. తప్ప ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదు. ఐదు సంవత్సరాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ఫిర్యాదులు లేని పాలన కొనసాగించాం.

– రాజిరెడ్డి, మాజీ సర్పంచ్, దోమ